తరలింపుపై తర్జనభర్జన

రేకుల షెడ్లలో కొనసాగుతున్న డిగ్రీ కళాశాల

- పట్టణ శివారులో నూతన భవన నిర్మాణం
- కొత్త కళాశాల దూరమంటున్న విద్యార్థులు
- కాలేజీని తరలించాలంటున్న ప్రభుత్వం

కళాశాల తమకు దగ్గరలో ఉండాలని విద్యార్థులు కోరుకుంటారు. అంతేకాకుండా కాలేజీలో నాణ్యమైన బోధన, ఫ్యాకల్టీ మెరుగైన వసతులు ఉంటేనే సర్కార్ డిగ్రీ కళాశాలను ఎంచుకునే పరిస్థితి. ప్రస్తుతం ప్రభుత్వ డిగ్రీ కళాశాల పట్టణం నడిమధ్యలో ఉంది. అయితే రేకుల షెడ్డులో కొనసాగుతోంది. ప్రభుత్వం కొత్త డిగ్రీ కళాశాలను పట్టణ శివారులోని మోడల్ స్కూల్ సమీపంలో నిర్మించారు. ఇంకా పూర్తి వసతులు కల్పించక పోవడంతోపాటు కళాశాల దూరంగా ఉండటంతో విద్యార్థులు ఇందులో చేరేందుకు ఆసక్తి చూపడంలేదు.



హుస్నాబాద్ పట్టణంలో రేకులషెడ్లలోనే కొనసాగుతున్న పాత ప్రభుత్వ డిగ్రీ కళాశాల

హుస్నాబాద్: 2008లో ఉన్నత విద్యను అందించేందుకు హుస్నాబాద్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేశారు. ఇది రేకుల షెడ్డులో కొనసాగుతోంది. పట్టణం చుట్టూ గ్రామాలు, తండాలు ఉన్నాయి. హుస్నాబాద్‌కు 40 నుంచి 45 కిలోమీటర్ల పరిధిలో మరో డిగ్రీ కళాశాల లేదు. సిద్దిపేట, కరీంనగర్, వరంగల్ నగరాలకు హుస్నాబాద్ 45 కిలోమీటర్ల దూరం. నిష్ణాతులైన 13 మంది అధ్యాపకులు ఉన్నారు. 300 మందికి పైగానే విద్యార్థులు చదువుకుంటున్నారు. దీంతో హుస్నాబాద్ కేంద్ర బిందువుగా మారింది.

పట్టణ శివారులో కొత్త డిగ్రీ కళాశాల

హుస్నాబాద్‌లోని మోడల్ స్కూల్ పక్కన రూ.2.20 కోట్లతో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను నిర్మించారు. సదుపాయాలు కల్పించకుండానే గత ఏడాది అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ కళాశాలను ప్రారంభించారు. హుస్నాబాద్ బస్టాండ్ నుంచి మూడు కిలోమీటర్ల దూరం వెళితేనే కొత్త డిగ్రీ కళాశాలకు వెళ్లలేని పరిస్థితి. అయితే కళాశాలను



నిరుపయోగంగా కొత్త ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనం

షిఫ్ట్ చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులు కోరుతున్నారు. కొత్త భవనంలో పూర్తి స్థాయి వసతులు కల్పించక పోవడంతో కళాశాల యాజమాన్యం వెనుకంజ వేస్తోంది.

సదుపాయాలపై ఆరా

ఇటీవల మంత్రి పొన్నం ప్రభాకర్ కొత్త డిగ్రీ కళాశాలను సందర్శించి సదుపాయాలపై ఆరా తీశారు. వసతులు కల్పిస్తాం వెంటనే పాత కళాశాలను కొత్త భవనంలోకి షిఫ్ట్ చేయాలని ఆదేశాలు జారీచేశారు. దీంతో కళాశాల యాజమాన్యం వెళ్లాలా? వద్దా? అని ఆలోచనలో పడ్డారు. సంవత్సరం చివరలో దూరంగా ఉన్న కొత్త కళాశాలకు వెళితే విద్యార్థులు వస్తారా లేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది. నూతన అడ్మిషన్లు కష్టమని అధ్యాపకులు సందేహం వ్యక్తంచేస్తున్నారు. ఇటీవలనే కళాశాల అభివృద్ధి కమిటీ సమావేశమై చర్చించారు. ప్రస్తుతం పాత కళాశాలలోనే ఉండి అడ్మిషన్లు పెంచుకొని, పరిస్థితులను బట్టి కొత్త కళాశాల భవనంలోకి షిఫ్ట్ చేయొచ్చని సూచన ప్రాయంగా ఓ అంగీకారానికి వచ్చారు. కాగా పాత కళాశాలలోనే సౌకర్యాలు మెరుగుపరిచి, కొత్త కళాశాల భవనాన్ని ఇతర అవసరాలకు వాడుకోవచ్చనేది మరో వాదన వినబడుతోంది. కాలేజీని తరలిస్తారనే ప్రచారం జరుగుతుండటంతో కొంత మంది ప్రైవేట్ డిగ్రీ కళాశాల అనుమతి కోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. ఫీజు రీయింబర్స్‌మెంట్ వస్తుందని, విద్యార్థులు ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని, వారికే నగదు ఇచ్చి కళాశాలలో చేర్చుకునే అవకాశం లేకపోలేదని మరో వాదన. ఇదే నిజమైతే ప్రభుత్వ డిగ్రీ కళాశాల మనుగడ కష్టమేనని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ నిర్ణయంపైనే కళాశాల మనుగడ ఆధారపడి ఉంది.

కొత్త భవనంలోకి వెళితే అడ్మిషన్లు కష్టమే

పాత ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనం విద్యార్థులకు అనుకూలంగా ఉంటుంది. పట్టణానికి దూరంగా కొత్త కళాశాల భవనంలోకి తరలిస్తే భవిష్యత్‌లో అడ్మిషన్లు కష్టమే. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని పాత కళాశాలలోనే మెరుగైన వసతులు కల్పిస్తే బాగుంటుంది. అలాగే కొత్త కళాశాల భవనంలో కొన్ని సదుపాయాలు కల్పించాల్సి ఉంది. తరలింపుపై మంత్రి దృష్టికి తీసుకెళ్తాం. తప్పని సరిగా షిఫ్ట్ చేయాలని ఆదేశిస్తే అక్కడికే వెళ్తాం.

– విజయగిరి భిక్షపతి,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్,
హుస్నాబాద్

కాంగ్రెస్ విజయానికి కృషి

ఎన్ఎస్‌యూఐ మెదక్ పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి ప్రశాంత్



మైనంపల్లి హన్మంతరావును కలిసిన రాచకొండ ప్రశాంత్

గజ్వేల్‌రూరల్: త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలని మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు సూచించారని ఎన్ఎస్‌యూఐ మెదక్ పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి రాచకొండ ప్రశాంత్ తెలిపారు. ఎన్నికల ఇన్‌చార్జిగా నియమితులైన సందర్భంగా హైదరాబాద్‌లో మైనంపల్లి హన్మంతరావును మర్యాదపూర్వకంగా కలిసినట్లు చెప్పారు. కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు పార్టీలో గుర్తింపు ఉంటుందన్నారు. ప్రశాంత్‌ను పలువురు నాయకులు అభినందించారు.

బీజేపీ క్యాలెండర్ల పంపిణీ



కాన్గల్‌లో బీజేపీ క్యాలెండర్లను పంపిణీ చేస్తున్న చంద్రశేఖర్‌గౌడ్

తొగుట(దుబ్బాక): మెదక్ బీజేపీ అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావును భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్ గౌడ్ కోరారు. అయోధ్య శ్రీరామచంద్ర మూర్తి, ప్రధాని మోదీ, రఘునందన్‌రావు ఫొటో ఉన్న క్యాలెండర్లను కాన్గల్‌లో మంగళవారం ఇంటింటికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ మూడోసారి ప్రధానమంత్రి కావడం ఖాయమన్నారు.

క్యాలెండర్ల పంపిణీ

సిద్దిపేటకమాన్: సిద్దిపేట పట్టణంలోని లింగారెడ్డిపల్లిలో అయోధ్య రాముడిని ముద్రించిన క్యాలెండర్లను బీజేపీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం పంపిణీ చేశారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేయాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేసీఆర్‌కు ఉగాది శుభాకాంక్షలు



కేసీఆర్‌కు వ్యాసాలను చూపుతున్న రాంరెడ్డి

తొగుట(దుబ్బాక): మాజీ సీఎం కేసీఆర్‌కు బీఆర్ఎస్ మండల నాయకులు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం ఎర్రవల్లి ఫాంహౌస్‌లో ఆయను బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి ఆధ్వర్యంలో కలిశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిపై వివిధ పత్రికల్లో తాను రాసిన వ్యాసాలను కేసీఆర్‌కు చూపించారు. వాటిని పరిశీలించి రాంరెడ్డిని అభినందించారు. ఈ సందర్భంగా కేసీఆర్ లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని సూచించారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ కొమురయ్య, సీనియర్ నాయకులు మల్లారెడ్డి, కనకయ్య పాల్గొన్నారు.

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని చాట్లపల్లి మాజీ సర్పంచ్, మండల సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు రాచర్ల నరేష్ గుప్త మంగళవారం మాజీ సీఎం కేసీఆర్‌ను మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డితో కలిసి కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కేసీఆర్‌కు శాలువా కప్పి పండగ శుభాకాంక్షలు తెలిపారు.

క్లుప్తంగా

ఘనంగా ఎన్ఎస్‌యూఐ ఆవిర్భావ దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): నేషనల్ స్టూడెంట్ యూనియన్ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్‌యూఐ) 54వ ఆవిర్భావ దినోత్సవాన్ని సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కోఆర్డినేటర్ రాజు మాట్లాడుతూ గత 54 ఏళ్లుగా విద్యారంగ సమస్యలపై ఎన్ఎస్‌యూఐ పోరాడుతోందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కొండలవాడి సతీష్, సిద్దిపేట నియోజకవర్గ అధ్యక్షుడు బడికోల్ రాకేశ్, మొగిలి రాకేశ్, సాజిద్, నరేష్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

తంజీంతో కాంగ్రెస్‌కు సంబంధం లేదు

సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): తంజీంతో కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ మత రాజకీయాలు చేయదని, అలాంటి వాటిని కాంగ్రెస్ పార్టీ ప్రోత్సహించదన్నారు. రంజాన్ వేడుకలను ఈద్గా మైదానంలో ఎప్పటిలాగే చేయాలన్నారు. తంజీం నాయకులు కావాలని కాంగ్రెస్ పార్టీపై నిందలు వేస్తున్నారని, ఇది సరికాదని తంజీం కమిటీ ఎన్నికపై కోర్టు ఇచ్చిన తీర్పును గౌరవించాలన్నారు. 40 ఏళ్లుగా ఈద్గాలో నమాజ్ చేయిస్తున్న పెద్దలనే కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గయాజుద్దీన్, ఎన్ఎస్‌యూఐ సిద్దిపేట జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రషాద్ తదితరులు పాల్గొన్నారు.

పండ్ల పంపిణీ



పండ్లను పంపిణీ చేస్తున్న గాడిపల్లి శ్రీనివాస్ రెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): టీపీసీసీ సెక్రటరీ గాడిపల్లి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో రంజాన్ పండగను పురస్కరించుకొని ముస్లింలకు మంగళవారం పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింలు పవిత్రంగా భావించే రంజాన్ మాసంలో నిష్టగా ఉపవాసం ఉంటారన్నారు. కార్యక్రమంలో బాల్ రెడ్డి, హుస్సేన్, అమీర్, సల్మాన్, షకీల్, తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు



ఎల్లారెడ్డిపేటలో ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎంపీటీసీ వెలుపుల స్వామి

తొగుట(దుబ్బాక): మండలంలోని ఎల్లారెడ్డిపేట ఎంపీటీసీ వెల్పుల స్వామి ముస్లింలకు మంగళవారం సాయంత్రం ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఉపవాస దీక్ష చేపట్టిన వారికి పండ్లు తినిపించి దీక్ష విరమింపజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసం ముస్లింలకు పవిత్రమైందన్నారు. పండగలు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలన్నారు. కార్యక్రమంలో గ్రామ మైనార్టీ కమిటీ అధ్యక్షుడు సైపొద్దీన్, నాయకులు యాకుబ్, ఇస్మాయిల్, అక్బర్, బీఆర్ఎస్ నాయకులు భాస్కర్, ఎల్లాగౌడ్, ప్రవీణ్, బాల్‌రాజు పాల్గొన్నారు.

రేపు కార్యకర్తల సమావేశం

కొండపాక(గజ్వేల్): ఈనెల 11వ తేదీన కుకునూరపల్లిలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో లోక్‌సభ ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్ నాయకుడు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ పిస్క అమరేందర్ మంగళవారం తెలిపారు. ఎమ్మెల్యే హరీశ్‌రావు, బీఆర్ఎస్ పార్టీ లోక్‌సభ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, మరి కొందరు నాయకులు సమావేశానికి హాజరవుతారన్నారు. ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని కార్యకర్తలు, నాయకులను కోరారు.

హన్‌మాన్ దేవాలయ నూతన కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులు

నంగునూరు(సిద్దిపేట): గట్లమల్యాలలోని హన్‌మాన్ దేవాలయ నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రమేశ్‌బాబు, ఉపాధ్యక్షుడిగా రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా తిరుపతి, కోశాధికారిగా మధు, కారవర్గ సభ్యులుగా శ్రీనివాస్, మల్లేశం, ప్రమోద్, చంటూ, శ్రీకాంత్, శివ, నగేశ్, సంపత్, శ్రీనివాస్, యాదగిరి, సంపత్ కుమార్, రాజు ఎన్నికయ్యారు.

పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత



మహిళకు ఫోన్ అప్పగిస్తున్న ఎస్ఐ రవికాంత్ రావు

మిరుదొడ్డి(దుబ్బాక): పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ సీఈఐఆర్ టెక్నాలజీతో ఫోన్ స్వాధీనం చేసుకుని తిరిగి బాధితురాలికి అప్పగించినట్లు భూంపల్లి ఎస్ఐ రవికాంత్‌రావు మంగళవారం తెలిపారు. పీఎస్ పరిధిలోని చౌదర్ పల్లికి చెందిన వల్లెపు లత తన మొబైల్ ఫోన్ నెల క్రితం అక్బర్‌పేటలో పోగొట్టుకుంది. సాంకేతిక సాయంతో ఫోన్ దొరికిన వ్యక్తి నుంచి స్వాధీనం చేసుకుని పోగొట్టుకున్న మహిళకు అందజేసినట్లు వెల్లడించారు.

ఈద్గాలో ఏర్పాట్ల పరిశీలన



ఈద్గా మైదానంలో ఏర్పాట్లపై చర్చిస్తున్న మాజీ మున్సిపల్ చైర్మన్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రంజాన్ పండగను పురస్కరించుకుని ఈద్గా మైదానంలో నమాజ్ ఏర్పాట్లను మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ ప్రార్థనకు ఈద్గా మైదానంలో ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రంజాన్ నమాజ్ ఉదయం 9.30 గంటలకు ఉంటుందన్నారు. అదేవిధంగా ఎప్పటిలాగే సిద్దిపేట షాహీ ఇమాం అబ్దుల్ సమీ ఆధ్వర్యంలో ప్రార్థనలు జరుగుతాయని తంజీమ్ కమిటీ సభ్యులు ప్రకటించారు. కార్యక్రమంలో తంజీమ్ కమిటీ సభ్యులు, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు.. పంచాంగ శ్రవణం

శ్రీక్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలను మంగళవారం ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఇళ్లు, వ్యాపార సముదాయాలను మామిడి తోరణాలతో అలంకరించారు. తమ ఇష్టదైవాలకు పూజలు చేసి ఉగాది పచ్చడి సేవించారు. గ్రామాల్లో దేవాలయాల వద్ద ఎడ్ల బండ్లను ఊరేగించారు. ఆలయాల్లో పంచాంగ శ్రవణం నిర్వహించారు. నూతన సంవత్సరంలో వర్షాలు, పాడి పంటలు తదితర ఫలితాలను పండితులు వినిపించారు. కొందరు తమకు ఈ ఏడాది ఆదాయ, వ్యయాలు ఎలా ఉన్నాయో తెలుసుకున్నారు.



సిద్దిపేటలోని శ్రీ వేంకటేశ్వర ఆలయంలో స్వామివారి హారతి కళ్లకద్దుకుంటున్న భక్తులు



గజ్వేల్‌రూరల్ : బూర్గుపల్లిలోని హనుమాన్ దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి



కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లిలోని రామాలయంలో ఉగాది వేడుకలు



కోహెడరూరల్(హుస్నాబాద్): బస్వాపూర్‌లో ..



నంగునూరు(సిద్దిపేట): గట్లమల్యాలలో..



చిన్నకోడూరు(సిద్దిపేట): సికింద్లాపూర్‌లో ..



మద్దూరు(హుస్నాబాద్): లద్నూరులోని రామాలయంలో ఉగాది వేడుకలు



బెజ్జంకి(సిద్దిపేట): గాగిల్లాపూర్ హనుమాన్ దేవాలయంలో పంచాంగ శ్రవణం వింటున్న భక్తులు



చేర్యాలలో శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో క్రోధి ఫలితాలను వినిపిస్తున్న పండితులు

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

మిరుదొడ్డి(దుబ్బాక): అనారోగ్య సమస్యలు భరించలేక ఆత్మహత్యకు యత్నించిన వృద్ధురాలు చికిత్స పొందుతూ మృతి చెందింది. భూంపల్లి ఎస్ఐ రవి కాంత్ రావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలో మోతె గ్రామానికి చెందిన బోదనం రంగవ్వ (63) అనారోగ్యంతో బాధ పడుతోంది. అనారోగ్య సమస్యలు భరించలేక ఈ నెల 8వ తేదీన పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. కుటుంబ సభ్యులు గమనించి సిద్దిపేట జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. మృతురాలి కొడుకు నరేష్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రతీ ఒక్కరూ దేశభక్తి కలిగి ఉండాలి

ఆర్ఎస్ఎస్ మెదక్ విభాగ్ కార్యావాహ నాగభూషణం

పెద్దశంకరంపేట(మెదక్): ప్రతీ ఒక్కరూ దేశభక్తిని కలిగి ఉండాలని ఆర్ఎస్ఎస్ మెదక్ విభాగ్ కార్యావాహ నాగభూషణం అన్నారు. మంగళవారం సరస్వతి శిశుమందిర్‌లో నిర్వహించిన ఉగాది ఉత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంఘ శాఖ ద్వారా పండుగ విశిష్టతను తెలియజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ సత్యనారాయణ, ఎంపీటీసీ వీణసుభాష్‌గౌడ్, గ్రామపెద్దలు వేణుగోపాల్‌గౌడ్, కనకరాజు, రవీందర్, దశ్వంత్, మల్లేశం, పున్నయ్య, క్రాంతిలాల్, జైహింద్‌రెడ్డి, వీరప్ప, సీతారం, సతీష్‌గౌడ్, సర్వేశ్వర్, మధు, సంతోష్ తదితరులున్నారు.

వైభవంగా బర్మాస్వామి జాతర

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని పిల్లుట్లలో కొలువైన బర్మాస్వామి ఉత్సవాలు మంగళవారం వైభవంగా జరిగాయి. పురోహితులు బర్మాస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారికి బండ్లు, బోనాల ఊరేగింపుతో పాటు రథోత్సవం నిర్వహించారు. జాతర సందర్భంగా నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి, మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రాఘునందన్‌రావు, నర్సాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి రాజిరెడ్డి, జెడ్పీటీసీ మహేశ్ గుప్తా, వివిధ పార్టీల నాయకులు చంద్రగౌడ్, మురళీధర్‌యాదవ్, మల్లేశ్‌గౌడ్, ఆంజనేయులుగౌడ్, కర్ణాకర్‌రెడ్డి, రమాకాంత్‌రెడ్డి, యాదగౌడ్, నర్సింహరెడ్డి, రవి, స్వామి, తదితరులు పాల్గొని పూజలు నిర్వహించారు.

నేడు తైబజార్ వేలం

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి శ్రీలక్ష్మీనర్సింహ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా పూజా తదితర సామగ్రి, తైబజార్ కోసం వేలం పాటలను బుధవారం బెజ్జంకిలో నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ విశ్వనాథ శర్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వారు ముందుగా ధరావత్తు చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని పేర్కొన్నారు.